ప్రశాంతంగా నీట్ పరీక్షలు

రంగారెడ్డిలో 97.26 హాజరు..
కేంద్రాలను తనిఖీ చేసిన మేడ్చల్ అదనపు కలెక్టర్

మేడ్చల్, రంగారెడ్డి: మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. పరీక్షల నిర్వహణ కోసం ఉభయ జిల్లాల అధికారులు అన్ని రకాల పటిష్ట ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ జిల్లావ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీ చేశారు. ఉప్పల్, మేడిపల్లి మండలాల్లోని సిఐఒఎస్ డిజిటల్ (నాగోల్), సూర్య టెక్నాలజీ (ఫిర్జాదిగూడ), మేడిపల్లి కాలేజీలోని కేంద్రాలను ఆయన పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో మేడిపల్లి తహసీల్దార్, సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో నీట్ పీజీ2026 పరీక్ష ప్రశాంతంగా పూర్తయింది. జిల్లాలోని 10 కేంద్రాల్లో మొత్తం 5,150 మంది అభ్యర్థులకు గాను 5,009 మంది (97.26) హాజరవ్వగా, 141 మంది గైర్హాజరయ్యారు. గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రంలో అత్యధికంగా 99.17 హాజరు నమోదైంది. కేంద్రాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

మేడ్చల్‌లో నీట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

పంటలు నీట మునిగి.. పత్తి రైతు కుదేలు

వాన పడితేనే గుక్కెడు!

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30, ప్రభాతవార్త: వానాకాలం ప్రారంభంలో కురిసిన తొలకరి జల్లులతో రంగారెడ్డి జిల్లా రైతులు ఎంతో ఆశగా సాగు పనులు చేపట్టారు. పొలాలను దున్ని, విత్తనాలు నాటి, పచ్చని పంటలతో కళకళలాడే పొలాలను చూడాలని ఆశించారు. అయితే ప్రారంభంలో ఆశలు రేపిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేయడంతో పరిస్థితి మారిపోయింది. ఎండ తీవ్రత పెరిగి భూమిలో తేమ తగ్గిపోతుండటంతో చిన్న మొక్కలు నీటి కోసం ఎదురుచూస్తూ వాడిపోతున్నాయి. పచ్చగా ఉండాల్సిన పొలాలు ఎండుముఖం పడుతుండటంతో రైతుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది.

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 5,06,257 ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది: ప్రధాన పంటలు: పత్తి, వరి, మొక్కజొన్న. ఇతర పంటలు: కందులు, పెసలు, మినుములు, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కూరగాయలు మరియు ఇతర వాణిజ్య పంటలు.

పత్తి పంటపై గుబులు: జిల్లాలో పత్తికి రైతులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దున్నకం, కూలీల కోసం భారీగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం మొక్కలు ఎదుగుదల దశలో ఉండగా నీటి కొరత ఏర్పడటంతో పెరుగుదల మందగించే ప్రమాదం ఉంది. వర్షాభావం మరికొన్ని రోజులు కొనసాగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు.

వరి పంటకు నీటి బెంగ: నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేస్తున్నప్పటికీ, నిరంతరం నీరు అవసరం కావడంతో చెరువులు, బోర్లు, బావులపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేకపోతే భూగర్భ జలాలు తగ్గి బోర్ల వినియోగం, విద్యుత్ ఖర్చులు మరియు సాగు వ్యయం పెరుగుతాయి.

మొక్కజొన్నకు తేమ కొరత: ఎదుగుదల దశలో ఉన్న మొక్కజొన్న పంటకు తగినంత తేమ అత్యవసరం. మెట్ట ప్రాంతాల్లో ఈ సాగు పూర్తిగా ప్రకృతి దయపైనే ఆధారపడి ఉంది. పప్పుధాన్యాల పరిస్థితి: కందులు, పెసలు, మినుములు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమైనప్పటికీ, మొలక దశలో మరియు ఎదుగుదల సమయంలో కనీస తేమ లేకపోతే దిగుబడి దెబ్బతింటుంది. వర్షాధార ప్రాంతాలు చిన్న రైతుల దయనీయ స్థితి మాడ్గుల్, తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్, యాచారం, కందుకూరు వంటి మెట్ట ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు ఒకటి రెండు తడులు అందిస్తున్నప్పటికీ, బోర్లలో కూడా నీటి మట్టం తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎలాంటి ప్రత్యామ్నాయ నీటి వనరులు లేని చిన్న, సన్నకారు రైతులు పంటలను కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో వర్షాలు లేక ఎండుతున్న జొన్న పంట

రంగారెడ్డిలో వర్షాభావం
జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో సాగు...
మెట్ట ప్రాంతాల్లో పరిస్థితి దయనీయం
తేమ లేక వాడిపోతున్న మొక్కలు
పత్తి, వరి, మొక్కజొన్నతో పాటు
పప్పుధాన్యాలపై వర్షాభావ ప్రభావం
బోర్ల ఆధారిత సాగుకూ పెరిగిన విద్యుత్ భారం
రూ. లక్షల పెట్టుబడులు గోదాట్లో పోసినట్లేనా?
అప్పుల భారంతో అన్నదాతల ఆందోళన

వరుణుడి కోసం నిరీక్షణ

సొంత డబ్బులతో పాటు భారీగా అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి కూలీలకు చెల్లించారు. పంటలు ఎండిపోతే కష్టమంతా వృథా అవుతుందని, కనీసం మరో రెండు మంచి వర్షాలు పడితేనే పంటలు బతికి పెట్టుబడులైనా తిరిగి వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వర్షాభావ ప్రాంతాలను గుర్తించాలని రైతులు కోరుతున్నారు. పంటల సంరక్షణకు సూచనలు ఇవ్వడంతో పాటు వర్షాలు మరింత ఆలస్యమైతే తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సకాలంలో వర్షం కురిసి పంటలకు ప్రాణం పోస్తేనే అప్పులు తీరి తమ కుటుంబాలు బతుకుతాయని జిల్లా రైతాంగం ఆశాభావంతో ఆకాశం వైపు చూస్తోంది.

రసాయనాలు వద్దు

సేంద్రీయ సాగుతో ఆరోగ్యకరమైన ఆహారం
ప్రకృతి వ్యవసాయంలో ఏకలవ్య కృషిని స్ఫూర్తిగా తీసుకోండి
రైతులకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపు

భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త: రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలోని జినుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కేంద్రంతో పాటు నూతనంగా నిర్మించిన సందీపని గురుకుల పాఠశాల అదనపు భవనాన్ని, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. పాడుబడిన భూముల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ సేవలను అభినందించారు. రసాయనాలు, ఎరువులతో పండించిన పంటలు అనారోగ్యకరమని, సేంద్రీయ వ్యవసాయం వల్ల భూమి సారం పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు నాపరాతి పరిశ్రమలను కాపాడండి
ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి విజ్ఞప్తి

తాండూరు ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నాపరాతి పరిశ్రమలను కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన నిబంధనలు, రాయల్టీ చార్జీల పెంపు వల్ల నాపరాతి వ్యాపారులపై అదనపు భారం పడి పరిశ్రమ దెబ్బతినే అవకాశం ఉందని, దీనిపై ఆధారపడిన వేలాది కార్మిక కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడి

రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
కాంగ్రెస్,బిఆర్ఎస్‌లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశంలో అవినీతి లేని పాలన సాగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరులోని వీరశైవ కళ్యాణ మండపంలో వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా యు. రమేష్ కుమార్ బాధ్యతల స్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఏకతాటిపైకి...

★మేడ్చల్‌లో వేడెక్కిన గులాబీ రాజకీయం ★నెలల విరామం తర్వాత ఒకే వేదికపైకి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ★మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డితో సహా పార్టీ దిగ్గజాల అత్యవసర భేటీ
★రెండున్నరేళ్ల తర్వాత క్షేత్రస్థాయిలోకి పార్టీ శ్రేణులు ★కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు కార్యాచరణ ఖరారు ★పెండింగ్ అభివృద్ధి పనులు, ఎన్నికల హామీలపై ప్రత్యక్ష దాడికి నిర్ణయం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గులాబీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ శంఖారావం పూరించింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సిహెచ్. మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి అత్యవసరంగా సమావేశమయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీ రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొన్ని నెలలుగా దూరంగా ఉన్న జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అంతా ఒకే వేదికపైకి వచ్చి ఏకతాటిపై నిలవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. రెండున్నర సంవత్సరాల తర్వాత బిఆర్ఎస్ శ్రేణులు మళ్లీ ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్లేందుకు పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో నాయకుల్లో, శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా మైదానంలోకి దిగేందుకు ఈ సమావేశంలో పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి, ఆగిపోయిన అభివృద్ధి పనుల పరిస్థితి ఏంటి అనే అంశాలపై నాయకులు విస్తృతంగా సమీక్షించారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన సంక్షేమం, ప్రస్తుత పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ముఖ్యంగా జిల్లాలో సంచలనంగా మారిన 22ఎ భూముల సమస్యతో పాటు, స్థానిక సమస్యలను గుర్తించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సమరభేరి మోగించనున్నారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవడమే కాకుండా, కాంగ్రెస్ సర్కార్‌ను గట్టిగా నిలదీసేందుకు శ్రేణులను సంపూర్ణంగా సిద్ధం చేస్తున్నామని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

యాడారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి

సొంతింటి కలను నెరవేరుస్తాం

శామీర్‌పేట, ఆగస్టు 30, ప్రభాతవార్త : పేదల సొంతింటి కలను నెరవేర్చటానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాదారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఆమెతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, స్థానిక కౌన్సిలర్ ఎల్.హనుమాన్‌దాస్‌గౌడ్‌లతో కలిసి పాల్గొని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. యాదారం (12వ వార్డులో) గ్రామానికి చెందిన మద్దుల నారంరెడ్డి-లక్ష్మిలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయటంతో వారు సకాలంలో నిర్మాణం పూర్తి చేసుకోవటంతో ఆ ఇందిరమ్మ ఇళ్లను వారు ప్రారంభించారు. లబ్ధిదారులతో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తుందని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్. హనుమాన్‌దాస్‌గౌడ్, ఎస్.జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి భిక్షపతి, మాజీ సర్పంచు యాంజాల సుజాత, కాంగ్రెస్ నాయకులు ఎ.భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కరుణించవయ్య కాటమయ్య

బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఊరేగింపులో శక్తి వేషధారణలు

ఆమనగల్లు, ఆగస్టు30, ప్రభాతవార్త: ఆమనగల్లు పట్టణంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాటమయ్యస్వామి బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. పట్టణ సమీపంలోని కాటమయ్య గుట్టపై ఉన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరి స్వామివారితో పాటు ఇతర దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, చైర్మన్ పత్యనాయక్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎనముల రమేశ్, ఎర్రవోలు మహేశ్, కోఆప్షన్ మెంబర్లు ఖాదర్, కండె సీతమ్మ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని పూజలు నిర్వహించారు. గౌడ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు చుక్కా అల్లాజీగౌడ్, మండల అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు గజ్జె వెంకటయ్యల నేతృత్వంలో వచ్చిన ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. సాయంత్రం పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను మహిళలు తలపై ఎత్తుకుని డప్పుచప్పుల, అమ్మవార్ల వేషధారణల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. పోచమ్మ, మైసమ్మ దేవాలయాలను దర్శించుకుంటూ కాటమయ్యస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రంథాలయం వద్ద జనం పెద్ద ఎత్తున బోనాలను తిలకించగా, కాటమయ్యస్వామికి జై అనే నినాదాలతో పురవీధులు మార్మోగాయి.

బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా బోనాల పండుగ..తొట్టెల ఊరేగింపు

ఘట్‌కేసర్, ఆగస్టు 30, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు గ్రామదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో బోనాలు, తొట్టెల ఊరేగింపుతో ఉత్సవాల సందడి నెలకొంది. అంబేద్కర్‌నగర్, సాయినగర్, రాంనగర్, కుమ్మరిబస్తీ, బుగ్గానగర్, బాలాజీనగర్, గాంధీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, మేడపాటినగర్, టీచర్స్‌కాలనీ తదితర కాలనీల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, మహంకాళీ, పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. పలువురు దంపతులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీలు, మాజీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. డప్పుశబ్దాలు, శివసత్తుల పూనకాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.

ఫోన్ చూస్తుంటే మందలించారని..యువతి ఆత్మహత్య

వికారాబాద్, ప్రభాతవార్తః ఫోన్ ఎక్కువగా చూడొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న ఫిరంగి ప్రీతి(20) హైదరాబాద్ నగరంలోని బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో అవుట్‌సోర్సింగ్ కింద ఉద్యోగం చేస్తోంది. గత రెండు రోజులుగా ప్రీతి ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున వికారాబాద్‌లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటుంది. శనివారం ప్రీతి ఎక్కువగా ఫోన్ చూడటంతో తండ్రి శంకర్ మంది లించాడు. దీంతో మనోవేదనకు గురైన ప్రీతి శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ప్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా అప్పటికే ప్రీతి మృతిచెందడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని యువతి మరణానికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుకుమార్ తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దన్నందుకు..

ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. ఈ సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.

ఈ సంఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొండపల్లి సంజయ్(17) ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడే వాడు. గత కొంతకాలం క్రితమే తండ్రి మృతిచెందాడు. తల్లి సరస్వతి కూలీనాలి చేసి సంజయ్‌ను గారాబంగా పెంచుతోంది. సంజయ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో తల్లి సరస్వతి మందలించింది. మనో వేదనకు గురైన సంజయ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ప్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘు కుమార్ తెలిపారు.

ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా ఉంటాం

షాద్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో పోచమ్మ గుడి పునఃప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వెలిజర్ల గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని అన్నారు.

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆనంద్ మాదిగ

అసమానతలు లేని సమాజమే లక్ష్యం

పెద్దేముల్, ఆగస్టు 30, ప్రభాతవార్త: అసమానతలు లేని సమాజమే యంఆర్‌పిఎస్ లక్ష్యమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ అన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా మాజీ ప్రదానకార్యదర్శి స్వామిదాసు అధ్వర్యంలో పెద్దేముల్ మండల కేంద్రంలో నూతన కమిటీలను నియమించారు.పెద్దేముల్ మండల యం ఆర్‌పిఎస్ అధ్యక్షులుగా మామిడి సురేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా అనిల్ (దావిద్) మాదిగ, ప్రధానకార్యదర్శిగా ప్రవీన్ మాదిగ, ఉపాద్యాక్షులుగా బాల్‌రాజ్, ఎల్లెశం, యంఎస్‌పి మండల అధ్యక్షులుగా తొగుర్సే రాజు, యంఎస్ఎఫ్ మండల అధ్యక్షులుగా మాలె పురుషోత్తంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పి.ఆనంద్ మాదిగ మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ఉద్యమ పోరాటం స్ఫూర్తితో సాధించిపెట్టిన ఘనత ఎంఆర్‌పిఎస్‌దేనని అన్నారు. సమసమాజ స్థాపన లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యంఎస్‌పి జిల్లా ఉపాద్యాక్షులు నర్సిములు, యంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, ప్రదానకార్యదర్శి సుభాష్ మాదిగ, జిల్లా మాజీ కార్యదర్శి భరత్ మాదిగ, ఉమాశంకర్ మాదిగ, రాములు మాదిగ, పురుషోత్తం, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి

ప్రతాప సింగారంలో స్వాగత కమాన్‌కు ప్రారంభోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 30, ప్రభాతవార్త: పోచారం డివిజన్ ప్రతాప సింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వాగతం పలికే ఆర్చిని మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. శ్రీమహాంకాళి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి. కుమార్, కీసరగుట్ట దేవాదాయ ట్రస్టు బోర్డు సభ్యుడు పి.ప్రభాకర్, జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్ డి.బాలరాజు, డివిజన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్యార సురేశ్, నాయకులు ఎం. గణేశ్, మల్లేశ్, బుర్ర సాయిగౌడ్, సాయికిరణ్, సందీప్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి రథోత్సవం ఊరేగింపు దృశ్యం

వైభవంగా రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

కొడంగల్, ఆగస్టు 30 ప్రభాతవార్త : కొడంగల్ ప్రాంత వాసుల ఇలవేల్పు దైవంగా కొనసాగుతు భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్న రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 29 నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష అలంకరణలతో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసి అర్చన, మహా మంగళహారతి తదితర పూజలను ఆలయ అర్చకులు జయతీర్థాచారి, రాఘవాచారి నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా పేరొందిన స్వామివారి రథోత్సవ కార్యక్రమం ఆదివారం భక్తుల కొలహలం మధ్య స్వామి వారి కీర్తనలతో పూరవీధుల గుండా వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి రథోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో హరికథా కాలక్షేపంతో పాటు రాఘవేంద్ర స్వామి కీర్తనలు ఆలపించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జయతీర్థాచారి మాట్లాడుతు పట్టణంలోని బ్రహ్మణ్‌వాడీలో వెలసిన రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు గత 45సంవత్సరాలుగా భక్తుల కొలహలం మధ్య వైభవంగా కొనసాగుతున్నాయని, అందులో భాగంగా ఈ సారి కూడ ఉత్సవాల నిర్వహణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర స్వామి భజక మండలి సభ్యులు వెంకట్, లక్ష్మినారాయణ జ్యోషి, కిట్టుస్వామి, పురుషోత్తంరావు, శీలాదేవి పాల్గొన్నారు.

కీసర ఓఆర్ఆర్ నుంచి సైక్లింగ్ పోటీల దృశ్యం

మేడ్చల్ జిల్లాలో ముగిసిన క్రీడా పోటీలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. మూడవ రోజు ఆదివారం ఉదయం మేడ్చల్ జిల్లా కీసర ఓఆర్ఆర్ నుంచి యాద్గార్‌పల్లి చౌరస్తా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వరకు బాలబాలికలకు (క్రీడాకారులకు) సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం-2026 మేజర్ జాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజుల పాటు క్రీడాపోటీలు నిర్వహించటం జరిగిందని, ఆదివారం మూడవ రోజుతో పోటీలు ముగిసినట్లు మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ కుమారుడు అభిలాష్, జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, ఖేల్ ఇండియా సైక్లింగ్ ఖోచ్ కృష్ణ, మేడ్చల్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రసిడెంట్ పాల్ రాస్, కోశాధికారి నరేశ్, వైస్‌ప్రసిడెంట్ సిహెచ్ సాయికృష్ణ, రత్నాకర్, కెపి విజయ్‌కుమార్, భాగ్యరాణి, సంతోష్, సుమారు 50మంది వరకు సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

శామీర్‌పేట, ఆగస్టు 30, ప్రభాతవార్త : కొల్తూర్ గ్రామంలో శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహా ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామంలో శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మ వారి విగ్రహా ప్రతిష్ట కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. దీనిలో ఆయనతో పాటు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

శామీర్‌పేట, ఆగస్టు 30, ప్రభాతవార్త : ఎస్సీ, ఎస్టీల ఫౌరహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సమానత్వం, సామాజిక న్యాయం, సోదర భావ విలువలను పాటించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంట డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీ వద్ద ఫౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత ఫౌరహక్కుల దినోత్సవంను పురస్కరించుకుని సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి వివక్ష, సామాజిక అణచివేత దాడులు, వేధింపులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ భాద్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్లు, రెవెన్యూ ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినపుడు వారి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా చట్టప్రకారం తక్షణమే స్పందించాలని ఆదేశించారు. దాడులు, అవమానాలు, భూవివాదాలు, సామాజిక వివక్షతకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ భూములు, సంక్షేమ పథకాలు, ఫౌరహక్కుల ఉల్లంఘన కేసులను జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీల కమిషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ అండగా ఉంటుందని చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబునాయక్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు ధన్‌రాజ్‌నాయక్, వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, జిల్లా చైల్డ్ కమిటీ మెంబర్ బిఎన్.రాంమోహన్, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాఘవ, సంఘాల సభ్యులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు బహూకరిస్తున్న మహేందర్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

మోమిన్‌పేట్. ఆగస్టు 30. ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలు పక్కా నివాస గృహాలు నిర్మించుకుంటున్నారంటే ఒక ఇందిరమ్మ పథకంతోనేనని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని కెసారం, సైయ్యదలీపూర్ కాస్లాబాద్ తండా గ్రామాలలో తెలంగాణ రాష్ట్రశాసన సభానతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు నేడు ఇందిరమ్మ ఇండ్లను ఘనంగా ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ శుభసం దర్భంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న వారికి మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో గృహప్రవేశానంతరం పట్టు వస్త్రాలు కానుగా అందజేసి ఇంటిని నిర్మించుకున్న దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించి ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురెందర్, ఆయా గ్రామాల సర్పంచులు ఉద్దాల లలిత జైపాల్, జిల్లా పార్టీ ప్రధాన కార్యధర్శి సిరాజుద్దీన్, మం డల యూతన కాంగ్రెస్ పారీ అధ్యక్షులు శుభాష్, మండల స్థాయి నాయకులు మహంత్‌స్వామి, మాణెయ్య, ఎన్నేపల్లి ఉపసర్పంచ్ మన్నా న్, నర్సింలు, అప్సర్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆదివాసి కాంగ్రెస్ జిల్లా అబ్జర్వర్‌గా శ్రీనునాయక్

షాద్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ విభాగం అధికారిగా ఉత్తర్వులు జారీ చేసింది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 13 జిల్లాలకు అబ్జర్వర్ లను కేటాయించింది. ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్లను నియమకానికై అదే విధంగా జిల్లాలోని ఆదివాసి కాంగ్రెస్ నియోజకవర్గ మండల స్థాయి అధ్యక్షులను వారి యొక్క దరఖాస్తులను తీసుకుని నియమించడంలోను నిర్మాణాత్మకంగా నిర్మించుటకు ఈ యొక్క కమిటీలను కేటాయించింది. అందులో భాగంగానే షాద్నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోను అదేవిధంగా ఆదివాసి విభాగంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా చురుకైన పాత్ర పోషించిన శ్రీను నాయక్‌ని నియమించింది. విద్యార్థి దశ నుండి జీవితాన్ని ప్రారంభించిన శ్రీను నాయక్ పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ అటు తెలంగాణ స్వరాష్ట్ర పోరాటంలోనూ అటు బహుజన ఉద్యమాలను విద్యార్థి ఉద్యమాలను కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ లో సైతం నాటి నుండి నేటి వరకు గ్రామం నుండి జిల్లా స్థాయి రాష్ట్ర వరకు తన దంటూ పాత్ర పోషించు కుంటూ గతంలో ఆదివాసి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ట్రైనింగ్ క్యాంపుల నిర్వహణలోనూ ఇతర రాష్ట్రాలకు ట్రైనర్‌గా వెళ్లడం జరిగింది.

శ్రీను నాయక్

స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీలో ఒక చిన్న గ్రామం నుండి మారుమూల తండాల నుండి రాష్ట్రస్థాయిలో కీలక పాత్ర పోసిస్తు నేడు రెండు జిల్లాలకు అబ్జర్వర్‌గా నియామకం కావడం గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విదంగా పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి ఆశీర్వాదంతో పూర్తి బాధ్యతతో నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు ఇచ్చిన ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ శంకర్ నాయక్ గారికి అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి ప్రతి ఒక్కరికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు.

26 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

షాద్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన 26 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి. ఉదయ తెలిపారు. ఖాళీలు, విద్యార్హతలు, వయోపరిమితి, ఇతర అర్హత ప్రమాణాలు, నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్లో పరిశీలించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

కాంగ్రెస్ మండల వైస్‌ప్రెసిడెంట్‌గా సంతోష్‌కుమార్

కొడంగల్,ఆగస్టు 30ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల వైస్‌ప్రసిడెంట్‌గా పాటుమీదిపల్లి గ్రామానికి చెందిన వార్ల సంతోస్‌కుమార్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం కొడంగల్ పట్టణంలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, పీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో పూర్తి స్థాయిలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వైస్‌ప్రసిడెంట్‌గా వార్ల సంతోష్ ఎన్నికైనట్లు ప్రకటించారు. గతంలోను మండల వైస్‌ప్రసిడెంట్‌గా కొనసాగిన సంతోష్ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డిలకు సన్నిహితుడు కావడంతో పాటు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా తనవంతు కృషి చేశారు. ఈ క్రమంలో ఆయనను రెండవ సారి మండల వైస్ ప్రసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవ సారి వైస్‌ప్రసిడెంట్‌గా ఎన్నుకోవడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కాలనీవాసులు

కన్నుల పండుగగా మైసమ్మ తల్లి వార్షికోత్సవం

షాద్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : రైతు కాలనీ, జానం పేట లోని కోట మైసమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడు కలు ఆదివారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా నిర్వహించారు. వార్షి కోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అమ్మవారి అలంకరణతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వ హించడంతో రైతు కాలనీలో పండగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.50 గంటలకు అమ్మ వారికి అభిషేకం, 8.30 గంటలకు ప్రత్యేక అలంకరణ, 10 గంటలకు పుణ్యాహవాచనం నిర్వహించారు. 11 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి పల్లకి సేవను ఘనంగా నిర్వహించగా భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. 12.45 గంటలకు మహా మంగళహారతి, 1 గంటకు నైవేద్యం, తీర్థ ప్రసాద వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సేవా సమితి అధ్యక్షులు మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ఆలయం నిర్మించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తృతీయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి ఏటా వార్షికోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహి స్తున్నా మని, భక్తుల సహకారం, దాతల సహాయంతో కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా సమితి అధ్యక్షులు మల్లేష్ గౌడ్, శుక్రవర్ధన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, జర్నలిస్ట్ కేపీ, సర్పంచ్ గోపాల్ రెడ్డి, ప్రదీప్, వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ బుచ్చన్న, అడ్వకేట్ గంధం సురేందర్, బాలయ్య, రాకేష్, బోనాల మారుతి, పెంటయ్య, సురేష్, శ్రీశైలం, రామచంద్రయ్య, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆకుల సంపత్, చెరుకు శివ, శివ, పద్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ పారాయణ సభ్యుల అధ్యక్షులు స్వరాజ్ బాబు, సేవా సమితి సభ్యులు, రుద్రవీణ యూత్ సభ్యులు, రైతు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేశంపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త: చదువుల బడిలో తీపి జ్ఞాపకాల మెరుపులు తీపి జ్ఞాపకాలతో ఒక రోజంతా మళ్ళీ ఒకట్రెన పాత మిత్రులు కేశంపేట మండల పరిధిలోని కాకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎంతో ఘనంగా జరిగింది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసు కున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో కలిసి చదువుకున్న రోజులు, ఉపాధ్యా యుల బోధనలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, తమ ప్రస్తుత పరిస్థితులు, కుటుంబ విషయాలను తెలుసుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమం స్నేహపూర్వక, ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

ఆలయ భూమికి కంచే వేస్తున్న దృశ్యం

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

కేశంపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త : కేశంపేట మండల కేంద్రం లోని ధవళగిరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 5 ఎకరాల 20 గుంటల స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షిం చేందుకు గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ ఆధ్వ ర్యంలో గూడ రామ్మోహన్ రావు, బిజెపి సీనియర్ నాయకుడు తల సాని పవన్ కుమార్ రెడ్డి పిల్లి అమరేష్ యాదవ్‌ల ఆర్థిక సహా యంతో ఆలయ భూమి చుట్టూ సరిహద్దులను నిర్ణయించి ఫెన్సింగ్ (కంచె) పనులను పూర్తి చేశారు. ఆలయానికి చెందిన విలువైన భూమి దురాక్రమణకు గురికాకుండాముందుజాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు నిర్వాహకులుతెలిపారు. ఇటీవల సర్వే నిర్వహించి భూమి కొలతలను ఖరారు చేసిన అనంతరం, పక్కాగా ఫెన్సింగ్ నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. దేవాలయ ఆస్తులను కాపాడటంలో ముందడుగు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి, భవిష్యత్ నిర్మాణ పనులకు ఈ చర్య ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

లెఫ్టినెంట్ కర్నల్‌గా పదోన్నతి పొందిన నరేశ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న బిజెపి నేత సుదర్శన్‌రెడ్డి

దేశ రక్షణలో నరేశ్ గౌడ్ విశిష్ట సేవలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 30, ప్రభాతవార్త: పోచారం డివిజన్ నారపల్లికి చెందిన పల్లె నరేశ్ గౌడ్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా పదోన్నతి పొందడంతో బిజెపి నియోజకవర్గ ఇంఛార్జీ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆదివారం శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణలో విశిష్ట సేవలు అందిస్తూ లెఫ్టినెంట్ కర్నల్‌గా పదోన్నతి పొందడం మన అందరికి గర్వకారణమని అన్నారు. నరేశ్ గౌడ్ తల్లితండ్రులు పల్లెబిక్షపతి, మాధవిలను అభినందించారు. దేశ రక్షణలో ఉన్నత స్థాయికి ఎదగడం తల్లితండ్రులకు మాత్రమే కాకుండా నారపల్లి గ్రామానికి కాకుండా మేడ్చల్ నియోజకవర్గానికే గర్వకారణమని అన్నారు. నరేశ్ గౌడ్ సాధించిన ఈ పదోన్నతి యువతకు స్ఫూర్తిదాయకమని, యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా నాయకుడు బండారు పవన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు రాము యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా తీస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

జిటికె.రూరల్, ఆగస్టు 30, ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం ఆదివారం పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో జరిగింది. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకోసం లాటరీ పద్ధతిలో డ్రా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పార దర్శకంగా, న్యాయ బద్ధంగా ప్రభుత్వ సంక్షేమపథకాల ఫలాలు అందాలనే లక్ష్యంతో లాటరీ విధానంలో లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం అధికారులు నిర్వహించినట్లు తెలిపారు. పోచారం అన్నోజిగూడలో నిర్వహించే ఇందిరమ్మ టవర్‌లో 450 ప్లాట్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వనుండగా లాటరీ పద్ధతిలో ఎంపిక అయిన వారికే ఇళ్లు కేటాయిస్తారని తెలిపారు. ఈ పథకంలో ప్రభుత్వం ఐదు లక్షలు, లబ్ధి దారుడు విడతల వారిగా ఆరు లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్ తెలిపారు.

అంబేద్కర్‌కు నివాళులు అర్పించి మాట్లాడుతున్న సహదేవ్‌గౌడ్

బహుజనులు సామాజికంగా అభివృద్ధి చెందాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 30, ప్రభాతవార్త: బహుజనులు ఆర్థిక

ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్

'చిక్కడు...దొరకడు'

వివిధ పనుల కోసం కార్యాలయం చుట్టూ
చక్కర్లు కొడుతున్న పట్టణ ప్రజలు
తాళం వేసి దర్శనమిస్తున్న కమిషనర్ ఛాంబర్

సిద్దిపేట అర్బన్,ఆగస్టు 30, ప్రభాతవార్త : సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీకి పర్మినెంట్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ లేకపోవడం..హుస్నాబాద్ గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఈ ఇన్‌చార్జి కమిషనర్ మాత్రం మున్సిపల్ కార్యాలయంలో చిక్కడు....దొరకడనే ఆరోపణలు మాత్రం ఘాటుగా వినిపిస్తున్నాయి. ఎదోమొక్కుబడిగా మున్సిపల్ కార్యాలయంకు వచ్చి వెళ్లిపోతుండడంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.సిద్దిపేట మున్సిపాలిటీలో నామ్‌కే వస్తుగా ఉదయం పూట పారిశుద్ధ్య పనులకు హాజరవుతున్నారే తప్ప కార్యాలయంలో మాత్రం కనిపించడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హుస్నాబాద్ మంత్రి నియోజకవర్గం కావడంతో ఈ కమిషనర్ అక్కడికే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తుండడంతో సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఇన్‌చార్జి కమిషనర్ సుడా వైస్ చైర్మన్‌గా సైతం కొనసాగుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ ఎప్పుడు తాళం వేసే కనిపిస్తుందని కార్యాలయానికి వచ్చే ప్రజలు చర్చించుకుంటున్నారు.

కొత్త ఇంటి నిర్మాణాలు
ఇంటి నంబర్ల కేటాయింపులో నిర్లక్ష్యం

పట్టణంలో కొత్త ఇంటి నిర్మాణాలు...ఇంటి నంబర్ల కేటాయింపులో సైతం పూర్తిగా నిర్లక్ష్యం జరుగుతుండడంతో బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు.ఇంటి నిర్మాణాలు, కొత్త ఇంటి నంబర్ల కేటాంపులో రోజుల తరబడి ఆలస్యం జరుగుతుండడంతో కార్యాలయం చుట్టూ తిరగడం తప్పడం లేదు. దీనికి తోడు 75 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ప్రజల నానాతంటాలు పడుతున్నారు. రోజు రోజు ఇవ్వాల్సిన సర్టిఫికెట్లు రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో ప్రజల అసహనం వ్యక్త చేస్తున్నారు. ఎంతో అవసరమైన జన, మరణ సర్టిఫికెట్లు సకాలంలో అందించక పోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆవేదనకు గురవుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం

చేపట్టే వారికి జీరో ఫీజు కింద ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. జీరో ఫీజు మూలంగా అనుమతులు ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. కొత్తగా ఇంటినిర్మాణం చేసుకున్న వారు నల్లా కనెక్షన్లు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఉండడం మూలంగా పట్టణంలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ కరువైంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిద్దిపేట స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను కేటాయించి పట్టణ ప్రజల ఇబ్బందులు తొలిగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ బడులను ప్రభుత్వమే బలోపేతం చేయాలి

సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 30, ప్రభాతవార్త :ప్రభుత్వ బడులను ప్రభుత్వమే బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించాలని విద్యా పరిరక్షణ కమిటి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కె. లక్ష్మి నారాయణ అన్నారు. సంగారెడ్డి జిల్లా విద్యా రక్షణ కమిటి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్ లో జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ విధ్యకు ప్రభుత్వం కనీసం 20 శాతం నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య అందరికి చేరుతుందని అన్నారు. పేద ప్రజలకు మంచి విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఇవ్వాళ 23వేల బడులను మూసివేస్తామనడం విషపూరిత చర్య అని అన్నారు. సమావేశంలో రాష్ట్ర సహధ్యక్షులు వై.అశోక్ కుమార్,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, రవీందర్, వసంత్, జగదీశ్వర్, భూమి శ్రీనివాస్, సామెల్, జేఏసీ మహిళా నాయకులు లక్ష్మీ, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, యుఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సందీప్ కుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌గావ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

సిర్గాపూర్, ఆగస్టు 30, ప్రభాతవార్త: మండల పరిధిలోని అంతర్‌గావ్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో 20లక్షల రూపాయలతో నిర్మించే సిసిరోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మెరుగైన రహదారులు,డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పాలన అందిస్తోందన్నారు. గ్రామానికి చెందిన లబ్దిదారునికి సిఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందచేస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లు, నాయకులు రవీందర్, మల్లారి, గోవింద్ నాయక్, రాజేందర్ పాటిల్, మోహన్‌రెడ్డి, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కార్మికుల హక్కుల కోసం సిఐటియు రాజీలేని పోరాటం

పటాన్ చెరు ,ఆగస్టు 30, ప్రభాతవార్త :కార్మికుల హక్కుల కోసం సిఐటియు రాజీలేని పోరాటం చేస్తున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి కే రాజయ్య పేర్కొన్నారు. పటాన్ చెరు పట్టణంలోని శ్రామి భవన్ లో ఆదివారం సాయంత్రం జరిగిన పెన్నార్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కే రాజయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలన్నీ సిఐటియు ద్వారానే పరిష్కారం అవుతాయని వారి సమస్యలపై నిరంతరం పోరాడే సంఘం సిఐటియు అన్నారు.

కార్మిక హక్కుల విషయంలో సిఐటియు రాజీ పడదని, ఇతర సంఘాలు మాత్రమే రాజీ పడటంతో పాటు కార్మికులను తాకట్టు పెడతాయని ఆరోపించారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శేషగిరిరావు, త్రిమూర్తులు, రాజు, దాసు, అర్జున్, రాజు, నగేష్, పాండురంగారెడ్డి తదితర కార్మికులు పాల్గొన్నారు.

తమ ఉనికిని కాపాడుకోవడానికే

ప్రభుత్వంపై బురదజల్లుడు

ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

చిన్నకోడూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త :
బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికే ప్రభుత్వం పై బురదజల్లుడు రాజకీయాలు చేస్తున్నారని ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట నిధులు కొడంగల్‌కు తీసుకు వెళ్లారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బిఆర్ఎస్ నాయకులు నిధుల మళ్లింపుపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.మార్చి 31 వరకు పూర్తి చేసిన ఇందిరమ్మ ఇండ్లకు చివరి బిల్లులు రూ.300 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్థం పర్థం లేని ఆరోపణలు, విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని బిఆర్ఎస్ నాయకులకు హితువు పలికారు. సమావేశంలో ఎఎంసి డైరెక్టర్లు, పార్టీ నాయకులు ఎం.డి.సలీం, సింగిరాల లక్ష్మీ, దేవరాయల సోని,పరుశురాం యాదవ్, ప్రశాంత్, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, జయంత్, గణేష్, చంద్రశేఖర్, చందు, రాజు, వెంకటేశం, కుమారస్వామి, హరిబాబు, అశోక్, శేషు, అరుణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సంక్షేమం పట్ల చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా జీవన భృతి రూ.4016, ఈపిఎస్ రిటైర్మెంట్ పెన్షన్ రూ.6 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచాలని సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివంచి కళానిలయంలో ఆదివారం బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్(సిఐటియూ) రాష్ట్ర నాల్గో మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీడీ పరిశ్రమ పై ఆధారపడి 7 లక్షల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో బీడీ కార్మికుల ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇస్తామని ప్రస్తుతం ఇస్తున్న జీవన భృతి రూ.4.016 పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు.జీవన భృతి రానటువంటి బీడీ కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలన్నారు.

రిటైర్మెంట్ పెన్షన్ చాలా తక్కువగా వందల్లో మాత్రం వస్తుందని కనీసం రూ.7500లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల కనీస వేతనాల జీవో కాలపరిమితి ముగిసి 15 యేండ్లు గడిచిన సవరించడం లేదన్నారు.వెంటనే కనీస వేతనాల జీవోను విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సంక్షేమం పట్ల చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ,సిఐటియు రాష్ట్ర కోశాధికారిగా వంగూరు రాములు తదితరులు మాట్లాడారు.

ఉద్యోగులకు టీబీఎస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

జహీరాబాద్, ఆగస్టు 30 (ప్రభాతవార్త):
ఉద్యోగ రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదిగిన ఇద్దరు యువకులను టీబీఎస్ జహీరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జహీరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఆర్టీసీ సంస్థలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన టీబీఈఎస్ఎస్ సభ్యుడు, చిలపల్లి తండా వాస్తవ్యుడు భంగి నాయక్ రాథోడ్ను అభినందించారు.

మున్నంబట్టి తండా వాస్తవ్యులు చందర్ రాథోడ్ కుమారుడు హరిసింగ్ రాథోడ్ బెంగళూరులో రూ.53 లక్షల వార్షిక ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించినందుకు ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా టీబీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసీరామ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాన్, ఉపాధ్యక్షులు ఇరలాల్ చవాన్, నానుసింగ్ రాథోడ్, హెచ్ఎం తుకారం చవాన్, టీబీఈఎస్ఎస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు రమేశ్ బానోత్, ప్రధాన కార్యదర్శి జైసింగ్ చవాన్, గౌరవ అధ్యక్షుడు దేవిసింగ్ రాథోడ్తో పాటు టీబీఎస్ నాయకులు లాలూసింగ్, సర్వేర్, పాండు పవార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మాల మహానాడు హైదరాబాద్ సభకు తరలి రండి

జహీరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:ఎస్సీ వర్గీకరణ విభజనలో మాలలకు రోస్టర్ విధానంలో జరిగిన అన్యాయాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అలమానాడు ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించే సభకు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్

జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లా లోని మాలలు పెద్ద ఎత్తున తల్లి రావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది డి. ఇస్మాలప్ప జిల్లా కార్యదర్శి ధనరాజ్ , నియోజకవర్గ కార్యదర్శి బాలరాజ్ , పట్టణ కార్యదర్శి రమేష్ లు కోరారు. సుప్రీంకోర్టు 2008 తీర్పుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి రాష్ట్రంలోని మాలలకు తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా జరిగే సభలలో మాలలు, విద్యావంతులు మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని వారి కోరారు.

వినియోగదారుల నమ్మకం సాయి గణేష్ షాపింగ్ మాల్

సదాశివపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త :
సదాశివపేట పట్టణంలోని సాయి గణేష్ షాపింగ్ మాల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్ ఆవరణలో లక్కీ డ్రా విజేతలను ప్రకటించి, విజేతలకు స్కూటీలను అందజేశారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కౌన్సిలర్

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 30, ప్రభాతవార్త :
జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీ ఆరో వార్డు పరిధిలోని రాయల్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆదివారం స్థానిక ఆరో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖాజా నవాజ్ ప్రారంభించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిసిసి అధ్యక్షులు నిమ్మర జగ్గారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ వైస్ చైర్మన్ ఆఫీస్ సభ్యుల సహకారంతో వార్డులో ఇప్పటికి 80 లక్షల పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎండి సోహెల్, స్థానికులు షకీల్, సాజిద్, షరీఫ్, కుర్షిద్, జమీల్, అన్వర్ హుస్సేన్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు

వెల్దుర్తి నుండి మెదక్ మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

వెల్దుర్తి ,ఆగస్టు 30, ప్రభాతవార్త :
వెల్దుర్తి నుండి మెదక్ వయా శెట్టిపల్లి కలాన్ రోడ్డుపూర్తిగా గుంతల మయంగా మారిందని అందుకు నిరసిస్తూ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ శ్రేణులు సోమవారం నాడు మహా పాదయాత్ర నిర్వహించనున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ శ్రేణులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా వెల్దుర్తి నుండి వెళ్లే ప్రధాన రహదారి మెదక్ వరకు పూర్తి గుంతల మయంగా మారిందని అటు ప్రయాణికులు ఇటు ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నారు.

గత బిఆర్ఎస్ హయంలో 18 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పుడు ప్రభుత్వం పనులు ప్రారంభించడం లేదని వారన్నారు. సోమవారం నాడు ఉదయం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శివంపేట మండలంలోని పోతుల కూడా మీదుగా వెల్దుర్తి నుండి వయా శెట్టిపల్లి కలాన్ మీదుగా పిల్లి కొట్టాల మెదక్ వరకు రోడ్డు అభివృద్ధి కోసం మహా పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని వీఆర్ఎస్ శ్రేణులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి.మాజీ జెడ్పిటిసి. రమేష్ గౌడ్. మాజీ ఎంపిటిసి మోహన్ రెడ్డి. అశోక్ గౌడ్. సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి. నాయకులు ప్రతాపరెడ్డి. కృష్ణ గౌడ్. తోట నరసింహులు. రమేష్ చంద్ర గుప్తా. శంకర్ రెడ్డి. మల్లేశం. శేఖర్. తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు.

హనుమాన్ మందిరం ఆవరణలో

ఘనంగా పూల మొక్కల నాటడం

సదాశివపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త:సదాశివపేట లోపలి కోటలోని హనుమాన్ మందిరం ఆవరణలో ఆదివారం పూల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆలయ ఆవరణ చుట్టూ పలు రకాల పూల మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, పోల మనోహర్, గాజుల అశోక్, సాయి గణేష్ డ్రెస్సెస్ ప్రొప్రైటర్ మల్లికార్జున్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. పచ్చదనం పెరిగితే ప్రకృతి సమతుల్యత కాపాడబడుతుంతో పాటు సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

హనుమాన్ మందిరం ఆవరణలో పూల మొక్కలు నాటుతున్న దృశ్యం

అమ్మవనంలో భక్తగణం..

ఏడుపాయల వనదుర్గమ్మ తల్లి

భక్తులతో కిక్కిరిసిన ఏడుపాయల క్షేత్రం...
మొక్కులు చెల్లించుకున్న భక్తులు...
మంజీరాలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మ దర్శనానికి బారులు...

పాపన్నపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త: భక్తుల కొంగు బంగారుతల్లిగా విరాజిలుతున్న వనదుర్గమ్మ వనంలో ఎటుచూసినా జనమే జనం.. అందరిలో భక్తి భావం.. ఆధ్యాత్మిక వాతావరణం.. ప్రతి నోట వనదుర్గమ్మ నామస్మరణ.. దేశంలోనే రెండో వన దుర్గామాత ఆలయంగా.. జనమే జయిని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత క్షేతం ఆదివారం భక్తులతో జనసంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. అమ్మదర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలు వురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. చల్లంగా చూడమ్మా.. వనదుర్గమ్మ తల్లి.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

గుమ్మడిదల, ఆగస్టు 30, ప్రభాతవార్త:
ఆదివారం కావడంతో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్న గూడెం వార్డులో కొలువైన వీరభద్ర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయానికి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షి ంచారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి రామ బ్రహ్మచారి, మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య పర్య వేక్షి ంచారు.ఆదివారం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

శ్రీ మల్లికార్జున స్వామికి వెండి బిందె విరాళం

స్వామి వారికి వెండి బిందెను విరాళంగా అందిస్తున్న దృశ్యం

కొమురవెల్లి, ఆగస్టు 30, ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి కొమురవెల్లి గ్రామానికి చెందిన అంబటిపల్లి యాదలక్ష్మీ కుటుంబ సభ్యులు ఆదివారం విలువైన వెండి బిందెను విరాళంగా అందజేశారు. సుమారు 876 గ్రాముల బరువున్న వెండి బిందె విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని దాత తెలిపారు. వెండి బిందెను ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్‌కు అందజేసి దేవస్థానం నుంచి తగిన రశీదు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,అర్చక బృందం, కుటుంబ సభ్యులు అంబటిపల్లి మల్లికార్జున్, వెంకటనరేందర్, రాము తదితరులు పాల్గొన్నారు. స్వామివారికి వెండి బిందెను విరాళంగా అందించడం పట్ల ఆలయ సిబ్బంది దాతను అభినందించారు.

వైభవంగా అఖండ శివనామ సప్తాహం ప్రారంభం

పాపన్నపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త: పాపన్నపేట మండలం కుర్తివాడ ప్రధాన రహదారివద్ద ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అఖండ శివనామ సప్తాహ కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రతిసంవత్సరం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు, భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు నిర్విరామంగా "ఓం నమః శివాయ నామస్మరణ జరుగనుంది. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆలయ అర్చకులు శ్రీ రమేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించి సప్తాహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ చుట్టుపక్కల గ్రామాల భజన మండళ్ల సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో శివనామస్మరణ చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని, భగవంతుని అనుగ్రహం లభిస్తుందన్నారు.

తునికి నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణం

భక్తులతో పోటెత్తిన నల్లపోచమ్మ ఆలయం

కౌడిపల్లి, ఆగస్టు 30, ప్రభాతవార్త:
మెదక్ జిల్లాలోని రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి నల్ల పోచమ్మ ఆలయం శ్రావణమాసం రెండవ ఆదివారంనాడు భక్తులతో పోటెత్తింది. ఉదయం నుండే భక్తులు శ్రావణమాసం ఆదివారం నాడు పెద్ద ఎత్తున నల్లపోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శివప్ప, ఇన్చార్జి ఆలయ ఈవో రంగారావు, ఆలయ కమిటీ అభివృద్ధి చైర్మన్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్ ల ఆధ్వర్యంలో నల్లపోచమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, పట్టు బట్టలతో అలంకరించి, కుంకుమార్చన చేసి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తునికి నల్ల పోచమ్మ అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. . కోరిన కోరికలు తీర్చిన తునికి నల్లపోచమ్మ అమ్మవారికి డప్పు చప్పుళ్లతో, శివ సత్తుల పూనకాలతో బోనాలను పెద్దఎత్తున ఆలయానికి ర్యాలీగా తరలివచ్చి అమ్మవారి ఆలయం చుట్టు ప్రదర్శన నిర్వహించి ఆలయం ఎదుట భోజనం నైవేద్యాలను సమర్పించి, అమ్మవారి ఆశీర్వాదం పొందారు. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం కుంకుమార్చన నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు గ్రామ సర్పంచ్ ధనలక్షి ్మ శేఖర్, ఉపసర్పంచ్ మధు గౌడ్, గ్రామ పెద్దలు బండా సాయ గౌడ్, శేఖర్, కొండల్ రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, పూజారులు రాజేష్ , విగ్నేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస

సామూహిక వనభోజనం

కొండపాక, ఆగస్టు 30, ప్రభాతవార్త:
కుకునూరుపల్లి మండల కేంద్రంలో అదివారం కార్తీక మసంను పురస్కరించుకొని పోచమ్మ, ముత్యాలమ్మ తల్లికి అర్యవైశ్య సంఘం అధ్వర్యంలో శ్రావణమాస సముహిక వనభోజన కార్యక్రమం నిర్వహించి, బోనాలు సమర్పించారు . సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి అందరు సుభిక్షంగా ఉం డాలని కోరుకున్నట్లు వారు త

మాట్లాడుతున్న మద్దికుంట శ్రీకాంత్‌శర్మ

గణపతి నవరాత్రి ఉత్సవాల పవిత్రతను కాపాడుకుందాం

హిందూ ధర్మచక్రం వ్యవస్థాపక అధ్యక్షులు మద్దికుంట శ్రీకాంత్‌శర్మ

ధర్నాచౌక్, ఆగస్ట్ 30, ప్రభాతవార్త: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భక్తిపాటలు, కోలాటాలు, మంగళవాయిద్యాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలవంటి భక్తిభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించి, ఉత్సవాల పవిత్రతను కాపాడుకుందామని హిందూ ధర్మచక్రం వ్యవస్థాపక అధ్యక్షులు మద్దికుంట శ్రీకాంత్‌శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం వినాయక మండపాలలో డిజె సినిమా పాటలు, నిషేధించాలని, అదేవిధంగా వ్యాపారంగా మార్చుకున్న వినాయక మండపాల లాటరీలపై నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో హిందూ ధర్మ చక్రం సంస్థ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ ధర్మచక్రం సంస్థ సభ్యులు మాట్లాడుతూ గణేష్ మండపాలలో డిజె, సినిమా పాటలు, లాటరీలపై నిషేధం విధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు కఠిన నిబంధనలు పాటించాలని కోరారు. వినాయక నిమజ్జన సమయంలో ఊరేగింపులలో డిజె, సినిమా పాటలు. అసభ్యకర నృత్యాలు అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మచక్రం సంస్థ సభ్యులు మాడుగుల శ్రీధర్, రామచంద్రమూర్తి, ఎవిఎస్ఎస్ శర్మ, శ్రీనివాస్, శివరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న జాతర వేడుకలు



మల్లన్న జాతరలో పాల్గొన్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

నార్సింగి, ఆగస్టు 30 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్ డివిజన్‌లో ఆదివారం మహిమాన్విత మల్లన్న జాతర వేడుకలు కనుల పండువగా జరిగాయి. యాదవుల సాంప్రదాయ డోలు దరువుకు అనుగుణంగా భక్తులు నృత్యాలు చేస్తూ మల్లన్న స్వామి జీవిత చరిత్ర గాథలను వివరించారు. ఒగ్గుకథ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు తలంటు స్నానాలుచేసి సామూహికంగా మల్లన్న, సౌడమ్మలకు సమర్పించిన బోనాల ఘట్టం అందరిని భక్తిసాగరంలో ఓలలాడించింది. ఈ వేడుకలకు మాజీ మేయర్ బి. మహేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి సురేష్‌గౌడ్, యాదవ ప్రముఖులు క్యాతం పాపయ్య యాదవ్ తదితరులు మల్లన్న, సౌడమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు బండ్లగూడ జాగీర్ మల్లన్న భక్తిగీతాలపనతో మారుమ్రోగిపోయింది. ఈ వేడుకల్లో పుర ప్రముఖులు శేఖర్‌బాబు, ఆంజనేయులు, రాజు యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు

అమ్మవార్లకు బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

నార్సింగి, ఆగస్టు 30 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి వివేకానందనగర్ కాలనీలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. పోచమ్మ-మైమస్మ అమ్మవార్లకు ప్రతీ ఏటా శ్రావణమాసంలో బోనాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. కాలనీలోని ప్రతీ ఇంటి నుంచి భక్తులు బోనాలు సమర్పించేందుకు ఆలయానికి రావడంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి.మహిళలు తలపై మట్టికుండకు పసుపు, కుంకుమ బొట్లతో, నువ్వుల నూనెతో పెట్టిన దీపం, వేపాకులతో అందంగా అలంకరించిన బోనాలను పెట్టుకొని అమ్మవార్ల భక్తిగీతాలపన చేస్తూ, డీజే పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. ఒకేసారి 200.పైచిలుకు బోనాలు ఆలయానికి రావడంతో భక్తులంతా ఆనందపరవశులయ్యారు. కాలనీ వాసులు ఎంతో భక్తి,శ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు కాకుండా సామూహికంగా ఆలయానికి వచ్చి బోనాలు సమర్పించడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో మాజీ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్, పుర ప్రముఖులు భిక్షపతి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రామ్, సంతోష్, మల్లేష్ యాదవ్, బసంత్, నర్సింగ్‌రావ్, తిరుపతయ్య, కొండల్‌రెడ్డి, శ్రీనాథ్, రామకృష్ణ తదితరులతో పాటు వందలాది మంది భక్తజనం పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ: బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

నరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:

బంజారాల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవాలని ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లో ఆదివారం కనుల పండువగా జరిగిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతితో ముడిపడిన బంజారాల జీవన విధానం, బంజారా మహిళల ఆత్మీయత, సంస్కృతి, సాంప్రదాయాలు తీజ్ పండుగ ద్వారా ప్రతిబింబిస్తాయని తెలిపారు. స్వస్థలాలు వీడి ఇతర ప్రాంతాల్లో స్థిరపడినా బంజారాలు తమ సాంప్రదాయాలను కొనసాగించడాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బంజారా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ నాయక్, బంజారా సేవా దళ్ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు రాజేశ్వరి రాథోడ్, గౌరవ అధ్యక్షుడు మహిపాల్ నాయక్‌తో పాటు నరేష్ నాయక్, సురేష్ నాయక్, బడంగ్‌పేట్ బంజారా సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, హనుమంతు నాయక్, వేణునాయక్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



తీజ్ వేడుకలకు హాజరైన బంజారా మహిళలు

హరినామస్మరణతో మార్మోగిన శృంగేరి క్షేత్రం

చిక్కడపల్లి ఆగస్టు 30, ప్రభాతవార్త

ఆధ్యాత్మిక తేజస్సు, మంత్రోచ్చారణల తరంగాలతో ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని శృంగేరి జగద్గురు మహా సంస్థాన ప్రాంగణం వైకుంఠ ధామాన్ని తలపించింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ శ్రీపంచముఖి ఆంజనేయ సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొన్ని రోజులుగా దివ్య వైభవంగా సాగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం భక్తిపారవశ్యం నడుమ వైభవంగా ముగిసాయి. ఆలయ ధర్మాధికారి కళా విఎస్ జనార్దనమూర్తి, సీఈఓ పి.ఎ.మురళి సమక్షంలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా స్వామివారి సుప్రభాత సేవతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవల ముగింపు ఘట్టమైన ఆదివారం వేకువజామునే ఉషఃకాలంలో స్వామివారికి పవిత్ర సుప్రభాత సేవతో అర్చకస్వాములు పూజాదికాలను ప్రారంభించారు. అనంతరం వేద పండితుల ఘనమైన వేదఘోషల నడుమ మహాకుంభారాధన, శ్రీ మహాసుదర్శన లక్ష్మీనరసింహ హోమం, మూల మంత్ర హోమాలు నియమనిష్టలతో సాగాయి.యజ్ఞ గుండంలో హోమాగ్ని జ్వాలలు ఎగిసిపడుతుండగా, విశ్వశాంతిని, సమస్త ప్రాణికోటికి శుభాలను కాంక్షిస్తూ శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణఘట్టాలను కనులపండువగా నిర్వహించారు. యాగ ప్రక్రియ అనంతరం సర్వాంతర్యామియైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారికి దివ్యామృతమైన పంచామృత స్నానపన(అభిషేక) మహోత్సవాన్ని వైభవంగా జరిపారు.అనంతరం స్వామివారిని దివ్య

తులసి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

మంగళకరంగా, నయన మనోహరంగా అలంకరించారు. శృంగేరి సంస్థాన విశేష శోభతో విరాజిల్లుతున్న స్వామివారిని దర్శించుకుని భక్తులు మైమరచిపోయారు. పండితుల వేదఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ భక్తులలో ఆధ్యాత్మికానందాన్ని నింపాయి. పవిత్రోత్సవాల మహోన్నత ఘట్టమైన 'లక్ష తులసీ పూజ' నేత్రపర్వంగా జరిగింది. పవిత్ర తులసీ దళాలతో స్వామివారి దివ్య చరణాలను అర్చిస్తున్న వేళ, భక్తుల నుంచి 'గోవిందా.. శ్రీనివాసా.. వేంకట రమణా' అనే హరినామ స్మరణ మారుమోగింది. సర్వపాపహరమైన, అనంత పుణ్యఫలప్రదాయకమైన ఈ తులసీ అర్చనను దర్శించి భక్తజనం పులకించిపోయారు. ఈ దివ్య ఆధ్యాత్మిక వేడుకల్లో అపార భక్తజనసందోహం పాల్గొని, స్వామివారి కృపాకటాక్షాలను పొంది ధన్యులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నృత్య సమ్మేళనం

చిక్కడపల్లి, ఆగస్టు 30, ప్రభాతవార్త : చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ఆదివారం శ్రీ వాగ్దేవి వాయిద్య సంగీత కళా నృత్య సాంస్కృతిక సంస్థ నిర్వహణలో సప్త స్వర సంగీత వాయిద్య నృత్య సమ్మేళనం కన్నుల పండుగ గా జరిగింది. నాట్య గురువులు రేఖ, లలితా పద్మిని,సాహితీ కాకరాల,విజయ రామరాజ తదితరులు శిష్య బృందం కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా యాదవ సంఘాల నాయకులు రామచంద్ర యాదవ్, వంటాల జంగయ్య ,సురేష్ యాదవ్ లు పాల్గొని మాట్లాడుతూ నాగేంద్ర యాదవ్ సమర్థ వంతం గా కార్యక్రమ నిర్వహణ చేశారు అని అభినందించారు దివ్య లక్షి ్మ నిర్వహణ లో కళా కారులను సత్కరించారు వేదిక పై మేకల సతీష్ యాదవ్ జె రామ్ యాదవ్ అభిరామ్ వీర భోగ వసంత రాయలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీకి విశేష స్పందన

వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

ర్యాలీలో పాల్గొన్న వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు

శేరిలింగంపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త : సామాజిక తెలంగాణ ధ్యేయంగా పనిచేస్తున్న తెలంగాణ రక్షణ సేన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని శేరిలింగంపల్లి టీఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జి వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ అన్నారు. శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధినేతి కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా మక్తామహాబూబ్‌పేట్ డివిజన్‌లో 3వ టీఆర్ఎస్ జెండాను వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్ధించారు. టీఆర్ఎస్ మక్తా మహబూబ్‌పేట్ డివిజన్ అధ్యక్షులు గుండె దయానంద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి మక్తా చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. సభలో టీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోనికి రాగానే పార్టీ అమలు చేసే పాంచజన్యం గురించి, సామాజిక న్యాయం గుర్తించి ప్రజలకు వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం పక్కా, కవితక్క తెలంగాణకు తొలి మహిళా సీయం కావడం పక్కా అంటూ ఆయన జోస్యం చెప్పారు. ఈ భారీ ర్యాలీలో టీఆర్ఎస్ నేతలు, లావణ్య,షేక్ అస్లం, సందీప్‌కుమార్ కూర్మ, విష్ణుచారి, మురుగేసాన్, ప్రభు, ప్రభుముదిరాజ్, లక్ష్మీ, మాదవి, ప్రవీణ్, రఘు, మనోజ్, షేక్ వలి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలోనూ చెక్కుచెదరని శ్రావణ భక్తి

చిక్కడపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త : శ్రావణ మాసంలో భక్తి శ్రద్ధలు డిజిటల్ వేదికల ద్వారా నయా రూపాన్ని సంతరించుకున్నాయి. ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగ క్షేత్రంలో సంప్రదాయబద్ధంగా జరిగే రుద్రాభిషేకాలు, పూజల్లో దేశ విదేశాల నుంచి భక్తులు ఇళ్ల నుంచే పాల్గొనే వెసులుబాటును శ్రీమందిర్ యాప్ కల్పించింది. శ్రావణమాసంలో ఈ యాప్ ద్వారా లక్షలాది మంది భక్తులు 52 ప్రముఖ ఆలయాల్లో జరిగిన 385 పూజల్లో పరోక్షంగా భాగస్వాములయ్యారు. వేలాదిమంది భక్తులు 12 ప్రధానఆలయాలకు పెద్దఎత్తున కానుకలు, దక్షిణలు సమర్పించారు. ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగంలో శ్రావణ సోమవారాల్లో 40 లక్షల మహామృత్యుంజయ మంత్ర జపంతో పాటు నర్మదా జల రుద్రాభిషేకాలు వైభవంగా సాగాయి. ముఖ్యంగా ప్రయాణాలు చేయలేని వేలాదిమందికిపైగా వృద్ధులు ఈ వేదిక ద్వారా ఆలయాలతో అనుసంధానమయ్యారు.సాంకేతికత సంప్రదాయాన్ని మార్చలేదని, భక్తులకు ఆలయాలకు మధ్య ఉన్న దూరాన్ని మాత్రమే తగ్గించిందని నిర్వాహకుడు ప్రశాంత్ సచాన్ తెలిపారు.

హనుమాన్ ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించిన మాజీ మేయర్ పారిజాత

అభయాంజనేయ దేవాలయ ముఖద్వారం ప్రారంభం

నరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని చారిత్రక బాలాపూర్ దేవతలగుట్ట అభయాంజనేయ స్వామి దేవాలయ నూతన ముఖద్వారం (ఆర్చి) ఆదివారం ప్రారంభమైంది. గుట్ట దిగువన ఆర్‌సిఐ రోడ్డు పక్కన లక్షలాది రూపాయల వ్యయంతో భవ్యమైన ఆర్చిని నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన బడంగ్‌పేట్ మాజీ మేయర్, బాలాపూర్ మాజీ సర్పంచ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పూజలు నిర్వహించి ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, బాలాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మిసెస్ ఇండియా యూఎస్ఏ డాక్టర్ మాలినీ దాసరి

నరూర్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త: మధ్య వయస్సులో మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని మిసెస్‌ఇండియా యూఎస్ఏ డాక్టర్ మాలినీ దాసరి సూచించారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని తన్వీర్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిడ్‌లైఫ్ మెటబాలిక్ మేకోవర్ అంశంపై డాక్టర్ మాలినీ ప్రసంగిస్తూ మధ్య వయస్సులో మహిళల శరీరంలో జరిగే మార్పులను కేవలం బరువు పెరగడంగా చూడకూడదన్నారు. హార్మోన్ల మార్పులు, కండరాల పరిమాణం తగ్గడం, నిద్ర, ఒత్తిడి,ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమవంటి అనేక అంశాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వివరించారు.బరువు తగ్గడమే లక్ష్యంగా కాకుండా పోషకాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల చూపే శ్రద్ధను తమ ఆరోగ్యం విషయంలోనూ చూపాలని అన్నారు. మధ్య వయస్సును ఆరోగ్యం క్షీ ణించే దశగా కాకుండా భవిష్యత్ ఆరోగ్యానికి పునాది వేసుకునే అవకాశంగా చూడాలని డాక్టర్ మాలినీ పేర్కొన్నారు. శరీరం ఇచ్చే సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమానికి ఏఏపీఐ ఇండియా కో-ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ మీటా, డాక్టర్ నౌనిహాల్ సింగ్ నాయకత్వం వహించారు.

మాట్లాడుతున్న డాక్టర్ మాలినీ

విద్యను ప్రభుత్వం బలోపేతం చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నిజాంపేట్, ఆగస్టు 30, ప్రభాతవార్త

విద్య అందరి హక్కు అని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ అన్నారు. ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాసదస్సు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సత్యం అధ్యక్షతన జరిగిన సదస్సుకు జాన్‌వెస్లీ, ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జిల్లాలో నిర్వహించిన విద్యా రంగ సర్వేలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత,మౌలిక వసతుల లేమి, పారిశుధ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించామని జిల్లా కార్యదర్శి సత్యం తెలిపారు. విద్యకు ప్రభుత్వాలు అధిక నిధులు కేటాయించాలని, పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యా వ్యవస్థలో అసమానతలను తొలగించి అందరికీ నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020పై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులపై కుటుంబాల ఆర్థిక భారం పెరుగుతోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యా

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

యులు, అధ్యాపకుల నియామకాలు పెంచడంతో పాటు మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంచే విధంగా విద్యా విధానం ఉండాలని సూచించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం రంగాలను ప్రభుత్వ పరిధిలో బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను మూసివేయకుండా అవసరమైన వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలని నేతలు కోరారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రవి, అశోక్, శ్రీనివాసులు, రాజశేఖర్, రాథోడ్ సంతోష్, బి.వెంకట రామయ్య, లింగస్వామి, నరేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు కలిపి సుమారు 400 మంది సదస్సుకు హాజరయ్యారు.

తనపై ఆరోపణలు పూర్తిగా నిరాధారం

బిఆర్ఎస్ నేత సాయికృష్ణగౌడ్

నేరేడ్‌మెట్, ఆగస్టు 30 ప్రభాతవార్త : తనపై ఓ మహిళ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బిఆర్ఎస్ నాయకుడు జేకే సాయికృష్ణగౌడ్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఫిర్యాదు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాజకీయంగా తాను ఎదుగుతున్న తీరును ఓర్వలేకనే తనపై అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా సాయికృష్ణగౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేని కొందరు రాజకీయ కక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.తనకు సంబంధం లేని వ్యవహారంలో తన పేరును ప్రస్తావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడం వెనుక దురుద్దేశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈనాపై చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవు. వాస్తవాలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా బురదజల్లే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా" అని సాయికృష్ణగౌడ్ స్పష్టం చేశారు.ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు వాస్తవాలను నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే ఇలాంటి ఆరోపణలకు పాల్పడుతున్నారని, ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రజాసేవలో వెనుకడుగు వేసేది లేదని సాయికృష్ణగౌడ్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమం కోసం తన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

కార్మిక నేత రాజిరెడ్డి నివాళి

రాజిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవాం : కార్మిక నాయకుడు కె.రాజిరెడ్డి భౌతికకాయానికి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి ఆదివారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. రాజిరెడ్డి దీర్ఘకాలంగా జలమండలి ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సంక్షేమానికి కృషిచేశారని కొనియాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి నిబద్ధతతో పనిచేశారన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి జలమండలి ఉద్యోగ, కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బోనాలు నిదర్శనం...

ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న దేవాలయం నిర్వాహకులు

ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ గెలుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నాగోల్‌లోని శ్రీమహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఆయనకు అమ్మవారి జ్ఞాపకం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సబ్యులు కన్నగౌడ్, బద్దం మహేందర్‌గౌడ్ ఆర్య వైశ్య సంఘం నాయకులు అనిల్‌కుమార్, ప్రవీణ్, ట్రస్ట్ బోర్డ్ సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో ఘనంగా బోనాల జాతర

ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త: నాగోల్ గ్రామంలో ఆదివారం శ్రీమహంకాళి, శ్రీపోచమ్మ గ్రామ దేవతల బోనాల జాతర కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు మాజీ ఎమ్మెల్సీ శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఎగ్గే మల్